క్లుప్తంగా

సర్వసభ్య సమావేశం వాయిదా

చర్ల రూరల్: చర్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్న సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు తిరిగి ఈనెల 5న నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.ఈదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర శాసనసభ సమావేశాలు జరుగుతున్నందున సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరయ్యేందుకు వీలుగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు అందజేయాలని కోరారు.

తోటి ఉద్యోగుల చేయూత



చెక్కు అందజేస్తున్న సీఈ బిచ్చన్న

మణుగూరు రూరల్: మండలంలోని మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో జేపీఏగా విధులు నిర్వర్తిస్తున్న క్రీడాకారుడు టి.ప్రవీణ్‌కుమార్ అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబానికి సహోద్యోగులు, క్రీడాకారులు చేయూత అందించారు. ఈ మేరకు సేకరించిన రూ.35 వేలను చెక్కురూపంలో బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న బుధవారం ప్రవీణ్‌కుమార్ కుటుంబానికి అందజేశారు. ఎస్ఈ పార్వతి, డీఈలు మురళీకృష్ణ, సత్యనారాయణ, స్పోర్ట్స్ కార్యదర్శి నరసింహారావు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, రామ్మోహన్, హేమమూర్తి, అశోక్‌రెడ్డి, గోపి, ప్రేమ్‌ప్రకాష్, రమేష్, వెంకట్, ప్రవీష్, నవీన్, రాయ్‌సాబ్, ప్రసాద్, ఆరీఫ్ పాషా పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ చరిత్రాత్మకం

మణుగూరు టౌన్/మణుగూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడం చరిత్రలో నిలిచిపోతుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పిరినాకి నవీన్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేస్తారన్నారు.

క్షీరాభిషేకం..

అశ్వారావుపేటరూరల్: రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని వినాయకపురం గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు నల్లపు నరసింహారావు, నల్లపు సతీష్, కొవ్వాసి హరిబాబు, జగదీష్, ఉప్పల బ్రహ్మేంద్రరావు, శ్రీను, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

దమ్మపేట: రైతులకు రుణమాఫీ హర్షణీయమని టీడీపీ మండలాధ్యక్షుడు ఎండీ.వలీపాషా అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడగా గడ్డిపాటి సత్యం, కట్టం ఎర్రప్ప, కనితి లక్ష్మడు, సుబ్బారావు, వీరస్వామి పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

చర్ల: అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ముసలి సతీష్ అన్నారు. విద్య, వైద్య రంగాలకు అధికంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన చలో హైదరాబాద్ కార్యాక్రమానికి వెళ్తున్న సతీష్‌ను భద్రాచలంలో బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు.

3న ఇసుక వేలం

ములకలపల్లి: ఈనెల 3న ఇసుక బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పుల్లారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సీజ్ చేసిన 9 ట్రాక్టర్లు, ఒక లారీ ఇసుకను వేలం వేయనున్నట్లు తెలిపారు. స్థానిక తహసీల్‌లో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుమ్ముగూడెం : మండలంలోని దుమ్ముగూడెం, నర్సాపురం ఫీడర్‌లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి 11 వరకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మణుగూరు టౌన్: పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ సమీపంలో బుధవారం ఆగి ఉన్న డీసీఎం వాహనాన్ని మోటార్‌సైకిల్‌తో ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 100 పడకల ఆస్పత్రికి తరలించారు. యువకులు సారపాకకు చెందినవారుగా తెలిసింది.

రెవెన్యూ సిబ్బంది రిలీవ్

దుమ్ముగూడెం : దుమ్ముగూడెం తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న నలుగురు సిబ్బంది బుధవారం రిలీవ్ అయ్యారు. ఆర్ఐ ఆదినారాయణ, చైన్‌మేన్ రాజేష్, ఆఫీస్ సబార్డినేట్‌లు రాజు జయబాబు బదిలీ అయ్యారు.



గోరింటా పూసింది కొమ్మా లేకుండా.. మురిపాల అరచేత మొగ్గ తొడిగింది.. అని ఒక సినీ కవి వర్ణించిన రీతిలోనే ప్రతీ ఇంటా గోరింటాకు సందడి నెలకొంది. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకునేందుకు మహిళలు మరింత ఆసక్తి చూపుతారు. మందారంలా పూస్తే మంచి మొగుడు వస్తాడు... గన్నేరులా పూస్తే కలవాడు వస్తాడు అంటూ ఆటపట్టించుకుంటూ ఒకరికొకరు అందంగా గోరింట పెట్టుకుంటూ మురిసిపోతున్నారు. సౌందర్యానికి, ఆరోగ్యానికి ఉపయోగపడే గోరింటాకు పై ప్రత్యేక కథనం..

– భద్రాచలంఅర్బన్



మందారంలా పూసే..

ఇంటింటా గోరింటాకు సందడి

- ఆషాఢ మాసం మరింత ప్రత్యేకం
- సౌందర్యంతోపాటు దివ్య ఔషధంగా..

ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు ధరించడం ఆనవాయితీగా వస్తోంది. గోరింటాకు చెట్టు ఎక్కడ ఉన్నా.. వెతికిమరీ ఆకులు తెచ్చుకొని మెత్తగా రుబ్బి చేతులు, కాళ్లకు మహిళలు అందంగా పెట్టుకుంటారు. ఎంతబాగా పండితే అంతగా వారి జీవితం సుఖ సంతోషాలతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని నమ్మకం.

అందానికే కాదు.. ఆరోగ్యానికి..

గోరింటా అలంకరణకు, అందానికే కాకుండా ఆరోగ్యానికి సైతం ఉపయోగపడుతుందని ఆయుర్వేద, ఆరోగ్య వైద్యులు చెబుతున్నారు. వర్షరుతువు ప్రారంభానికి మధ్యలో ఆషాఢం వస్తుంది. ఈ సమయంలో మన శరీరం వేడితో కూడుకుని ఉండి, బయటి వాతావరణం చల్లబడుతుంది. ఈ కారణంగా గోరింటాకు ధరిస్తే శరీరంలోని వేడి బయట చల్లబడిన వాతావరణానికి విరుద్ధంగా తయారవుతుంది. గోరింటాకు శరీరంలో ఉండే వేడిని తగ్గించే శక్తిని కలిగి ఉండటంతో పాటు రోగనిరోధక శక్తిని సైతం పెంచుతుంది. చర్మ సమస్యలు కూడా దరిచేరవు. బాగానూరిన గోరింటాకును నొప్పిగా ఉన్న కీళ్లకు పెట్టడంతో నొప్పులు అదుపు చేయవచ్చు. గోరింట విత్తనాలు దుర్వాసన తొలగించే డీయోరెంట్‌గాను, మహిళలకు రుతుక్రమాన్ని సరి చేసేందుకుగాను నిపుణుల సలహాలతో వాడుతుంటారు. గోరింటా పూలు సుఖనిద్రను పెంచి తలనొప్పులను క్రమంగా తప్పిస్తాయి. గోరింట చెట్టు బెరడు పచ్చ కామెర్లను, కాలేయంవాపు తగ్గిస్తాయి. గోరింటాకు నుంచి లభించే లాసోన్ అనే రంగు పదార్థం సూక్ష్మజీవులను నశింప జేస్తుంది. తరచూ నోటిపూతతో బాధపడేవారు గోరింటాకు కషాయం నోటిలో వేసుకొని పుక్కిలిస్తే తగిన ఫలితం లభిస్తుంది.

ఆషాఢంలో మరింత ప్రత్యేకంగా..

ఆషాఢ మాసంలో వర్షాలు జోరుగా పడి నేలంతా తేమగా బురదతో నిండి ఉంటుంది. నిత్యం ఇంటి పనుల్లో తలమునకలయ్యే మహిళలు పదేపదే తడిలో తిరగాల్సి ఉంటుంది. వర్షాకాలంలో సహజంగా ఉండే తేమ ప్రభావంతో వారి చేతులు, కాళ్లు ఒరిసిపోవడంతో పాటు గోళ్లు తింటాయి. ఈ సమస్యలకు గోరింటాకుతో ఉపశమనం లభిస్తుంది. పల్లె, పట్టణం తేడా లేకుండా పండుగ, శుభకార్యం ఇలా సందర్భం ఏదైనా.. గోరింటాకు సంప్రదాయానికి ఆదరణ తగ్గడం లేదు. ఆషాఢ మాసంలో మహిళలు, యువతులు, చిన్నారుల సహా ఇంటిల్లి పాదీ గోరింటాకు పెట్టుకోవడం తెలుగింటి ఆచారంగా వస్తోంది.



గోరింటాకు కోస్తున్న మహిళలు

గోరింటాకుతో చర్మ సౌందర్యం



ఆషాఢంలో గోరింటాకు పెట్టుకునే సంప్రదాయం పూర్వీకుల నుంచి కొనసాగుతోంది. గోరింటాకుతో చర్మ సౌందర్యం వస్తుంది. గతంలో గోరింటాకు మొక్కలు ప్రతీ ఇంట్లోని పెరట్లోనూ ఉండేవి. ఇప్పుడు అరుదుగా పెంచుతున్నారు

– శ్రీధిరాల. రాజేశ్వరమ్మ, భద్రాచలం

ఎన్నో ఔషధ గుణాలు



గోరింటాకులో అనేక ఔషధ గుణాలున్నాయి. శరీరంలోని వేడిని తగ్గించడంతో పాటు రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ప్రధానంగా వర్షాకాలంలో వచ్చే చర్మ వ్యాధులను దూరం చేస్తుంది. గోరింటాకులో మాత్రమే ఇలాంటి ప్రయోజనాలున్నాయి

– వాసిరెడ్డి రాజేశ్వరి, బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలు

లాభాలను గుర్తించాలి



గోరింటాకుతో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్త నాళాల్లో రక్తం గడ్డ కట్టకుండా నిరోధిస్తుంది. మహిళల్లో గర్భాశయ దోషాలను తొలగించడంతో పాటు వేడి తగ్గించి వ్యాధులు రాకుండా నివారిస్తుంది. గోరింటాకు వల్ల లాభాలను గుర్తించాలి.

– డా. నిధిశ్రీ వైద్యాధికారిణి, భద్రాచలం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



దుమ్ముగూడెం: సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ చైతన్య



చర్ల రూరల్: గొమ్ముగూడెంలో వైద్య శిబిరం

దుమ్ముగూడెం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య సిబ్బంది సూచించారు. మండలంలోని పర్ణశాల, నర్సాపురం పీహెచ్‌సీల పరిధిలో డాక్టర్లు రేణుకారెడ్డి, సుభాష్‌లు ఇంటింటి ఫీవర్ సర్వేలను బుధవారం చేపట్టారు. హెల్త్ క్యాంపు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు.

ఆరోగ్యకేంద్రం సందర్శన..

మండలపరిధిలోని నరాసపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా యంసిహెచ్ అధికారి డాక్టర్ చైతన్య సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సీజనల్ వ్యాధులపై దిశానిర్దేశం చేశారు.

గొమ్ముగూడెంలో వైద్య శిబిరం

చర్ల రూరల్: మండలంలోని సత్యనారాయణపురం పీహెచ్‌సీ పరిధిలోని గొమ్ముగూడెం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ దివ్యనయన వైద్య పరీక్షలు మందులను పంపిణీ చేశారు. అదే విధంగా మండలంలోని లింగాపురంపాడు, ఆర్.కొత్తగూడెం గ్రామాల్లో సత్యనారాయణపురం వైద్య సిబ్బంది ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు.

ఏరియా ఆస్పత్రిపై నిర్లక్ష్యం వీడాలి

భద్రాచలంఅర్బన్: నాలుగు రాష్ట్రాలకు కూడలిగా ఉన్న భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, వైద్యశాలలో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఒక్క రోజు నిరసన దీక్ష చేపట్టగా భద్రాద్రి కళా భారతి అధ్యక్షుడు పాకాలపాటి దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ఈ నిరసన దీక్షను సంఘ సేవకులు, గాదె మాధవరెడ్డి, రోటరీ క్లబ్ కార్యదర్శి విద్యాసాగర్, ట్రెజరర్ శ్రీనివాస్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబీ.నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు వెంకటరామారావు, సంతోష్, లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు లక్ష్మీ, నాగరాజు, కుంజా శ్రీను, లక్ష్మణ్, ఫిరోజ్, శ్రీను, రత్నం, భూపేందర్ పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న సీపీఎం నాయకులు

కరాటే విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ

మణుగూరు రూరల్ : ఇటీవల హైద్రాబాద్ యూసఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో మణుగూరు ప్రాంత విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు ఆ విద్యార్థులు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డిని బుధవారం కలవగా వారికి అభినందనలు తెలిపారు.

పోస్టల్ సేవలు వినియోగించుకోవాలి

బూర్గంపాడు: గ్రామీణ ప్రాంతాల ప్రజలు భారత తపాలా శాఖ అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని మణుగూరు సబ్ డివిజన్ పోస్టల్ అధికారి శ్రీరామ్మూర్తి అన్నారు. మోరంపల్లిబంజర గ్రామంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోస్టాఫీస్‌ల్లో అందజేస్తున్న అన్ని రకాల సేవలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి భవాని, హెచ్ఎమ్ లీలావతి, సుబ్బరామిరెడ్డి, బంధన్ ప్రతినిధులు సుధీర్, సత్యనారాయణ, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పదు

అశ్వారావుపేటరూరల్: ఉద్యోగంలో చేరిన నాటి నుంచి అహర్నిశలు శ్రమించే ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక గిరిజన భవన్‌లో అశ్వారావుపేట ఎంపీడీఓ గొట్టుపర్తి శ్రీనివాసరావు, రోడ్లు భవనాల శాఖ జేటీవో(ఏఈ) శెట్టిపల్లి కృష్ణార్జున్‌రావుల ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. ఎంపీపీ, సొసైటీ చైర్మన్లు సీహెచ్ సత్యనారాయణ, నిర్మల పుల్లారావు, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, నాయకులు జూపల్లి రమేష్, దమ్మపేట ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, విద్యాధరరావు, ఆర్అండ్‌బీ డీఈఈ శ్రీనివాసరావు, ఏఈ రామిశెట్టి శ్రీనివాసరావు అధికారులు పాల్గొన్నారు.

లైన్ ఇన్‌స్పెక్టర్ సేవలు మరువలేనివి

విద్యుత్ శాఖలో ఉద్యోగం ఎంతో కష్టంగా ఉంటుందని, గ్రామీణ ప్రాంతాల్లో మరింత ఇబ్బందులు ఉంటాయని ఆ శాఖ డీఈఈ నందయ్య అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని వినాయకపురం సబ్‌స్టేషన్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్ మారుతీ రామకృష్ణ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన్ని సన్మానించారు. ట్రాన్స్‌కో ఏడీఈ బీ.వెంకటేశ్వర్లు, ఏఈలు సంతోష్, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బూర్గంపాడు: మోరంపల్లిబంజర పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా సేవలందించి పదవీ విరమణ పొందిన రమణమూర్తిని చేయూత ట్రస్ట్ ప్రతినిధులు సన్మానించారు. జిల్లా మలేరియా అధికారి స్పందన, ఏఎస్ఎంలు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు స్కూల్‌లో 30 ఏళ్ల బైరీ శ్యాం ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా విశేష సేవలు అందించారని ఏరియా డీజీఎం (పర్సనల్) సలగల రమేశ్ అన్నారు. ఈ మేరకు పీవీకాలనీలోని బాంబేకాలనీలో పదవీ విరమణ పొందిన రమేష్‌ను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని అచ్చితాపురం ఎంపీపీఎస్ పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహించిన మేరీ కుమారి పదవీ విరమణ చేపట్టగా పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఎంఈఓ సున్నం సమ్మయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం ఎవి.రామారావు, ఎజె.ప్రభాకర్, ధర్మయ్య, శ్రీనివాస్, మరాజు,,రవి, కృష్ణ, నరసింహారావు, నాగమణి పాల్గొన్నారు.

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని సివిల్ విభాగంలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన గూడెపు దేవదాసు–రమాదేవి దంపతులను సింగరేణి సివిల్ రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు జీఎం కార్యాలయంలో సత్కరించారు. ఎ.మంగీలాల్, కె.గురుమూర్తి, శివరామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: ఎంపీడీవో దంపతులను సన్మానిస్తున్న సీఈఓ, జెడ్పీ చైర్మన్లు



మారుతీ రామకృష్ణ దంపతులను సన్మానిస్తున్న డీఈ, ఏడీఈ



మణుగూరు టౌన్: బైరి శ్యాం దంపతులకు సన్మానం

మణుగూరు ఏరియాలో 106 శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న ఏరియా జీఎం రాంచందర్

మణుగూరు టౌన్: మణుగూరు ఏరియాలో జూలై నెలలో 7.98 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 8.46 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి(106శాతం) నమోదైందని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. అయితే, వర్షాల కారణంగా ఓబీ వెలికితీత 11.00 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 54శాతమే జరిగిందని చెప్పారు. మణుగూరులోని ఏరియా కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. జూలైలో 27 రోజుల పాటు వర్షం కురవగా ఓబీ వెలికితీతకు అంతరాయం ఏర్పడిందని చెప్పారు. కాగా, కాంట్రాక్ట్ కార్మికులకు వైద్యపరీక్షలతో పాటు సమీప గ్రామాల్లో 15 వైద్యశిబిరాలు నిర్వహించామని తెలిపారు. అలాగే, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.30లక్షల బీమా వర్తించేలా హెడీఎఫ్‌సీ బ్యాంకులో అకౌంట్లు తీయిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో అధికారులు శ్యాంసుందర్, లక్ష్మీపతిగౌడ్, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి, మేరీకుమారి, అనురాధ, రాజు, షబ్బీరుద్దీన్, ఎస్.రమేశ్ పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ ముజాహిద్

బూర్గంపాడు: ప్రకృతి విపత్తుల సమయంలో ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఐటీసీ కళాభారతిలో విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... గోదావరి వరదల సమయంలో ముంపు నుంచి ప్రాణాలను ఎలా కాపాడుకోవాలనే విషయాలను వివరించారు. రక్షణ సిబ్బంది రాక ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పిడుగులు పడే సమయంలో, పాము, తేలు కాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సి చర్యలు వివరించారు. తహసీల్దార్ ముజాహిద్ మాట్లాడుతూ... ఎన్డీఆర్ఎఫ్ అధికారుల సూచనలు, జాగ్రత్తలు తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగభిక్షం, ఐటీసీ అడ్మిన్ మేనేజర్ చెంగలరావు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తుగా నివేదికలు ఎందుకివ్వట్లేదు?



నివేదిక చదివి వినిపిస్తున్న ఎంఈఓ

ములకలపల్లి: జనరల్ బాడీకి సంబంధించిన ప్రగతి నివేదికలు ముందస్తుగా ఎందుకు ఇవ్వడంలేదని పలువురు ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. ఈ మేరకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మట్ల నాగమణి అధ్యక్షతన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాదాసీదాగా సాగింది. ఈ సందర్భంగా పలుశాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం త్వరలో పదవీ కాలం ముగుస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలతోపాటు, ప్రజాప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సున్నం నాగమణి, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీఓ లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ కొదుమూరి పుల్లారావు, కో ఆప్షన్ సభ్యుడు జబ్బార్, ఎంపీటీసీలు, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలి

మణుగూరు రూరల్ : సీపీఎం ఆధ్వర్యంలో తలపెట్టిన సింగరేణి పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.బ్రహ్మాచారి విజ్ఞప్తి చేశారు. బుధవారం పట్టణంలోని లారీ అడ్డాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. యాత్ర ఈ నెల 3న మణుగూరుకు చేరుకుంటుందని, యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు, నాయకులు సాంబశివరావు, ఈశ్వర్‌రావు, సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వెంకటరత్నం, లక్ష్మణరావు, విల్సన్, వెంకన్న, శ్యామ్, సాంబయ్య, రమణ, యశోద పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న ఎస్సై స్వప్న

చండ్రుగొండ : విద్యార్థులు మత్తుకు దూరంగా ఉండాలని ఎస్సై గంజి స్వప్న అన్నారు. మండలకేంద్రం చండ్రుగొండలోని సేయింట్ జోసఫ్ పాఠశాలలో బుధవారం మాదకద్రవ్యాల వినియోగం – ఆరోగ్యం అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు.

వరద బాధితులకు వితరణ



దుస్తులు అందజేస్తున్న నాయకులు

అశ్వారావుపేటరూరల్: పెదవాగు ప్రాజెక్టు, వరద ముంపు బాధిత కుటుంబాలకు సీపీఐ ఆధ్వర్యంలో వితరణ అందించారు. బుధవారం అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాలకు చెందిన కుటుంబాలకు పార్టీ ఆధ్వర్యంలో రూ.2లక్షల విలువైన నిత్యావసరాలు, దుస్తులు, కూరగాయలను పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అందజేశారు. ఏపీలోని ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య, నాయకులు ప్రసాద్, సలీం, గన్నిన రామకృష్ణ, దారయ్య, సాయిబాబు పాల్గొన్నారు.

లింగన్న ఆశయ సాధనకు పోరాడుదాం

గుండాల: అజ్ఞాత దళ నేత లింగన్న ఆశయ సాధనకు పోరాడాలని న్యూడెమోక్రసి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, నాయకులు బండారి ఐలయ్య, ముక్తి సత్యం పిలుపునిచ్చారు. బుధవారం లింగన్న వర్ధంతి సందర్భంగా రోళ్లగడ్డ స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారాములు, పర్శిక రవి, వెంకన్న, నరేష్, ఉపేందర్, లాలయ్య, క్రిష్ణ, పెంటన్న, బాబు, మంగన్న, లాజర్ పాల్గొన్నారు. ప్రజాపంథా ఆధ్వర్యంలో లింగన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల సంయుక్త కార్యదర్శి శాంతయ్య, నాయకులు క్రిష్ణ, కుమార్, జగన్ ఉన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

బదిలీలు సహజమే

గుండాల: ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగరీత్యా బదిలీ సాధారణమని, మెరుగైన విధులతో గుర్తింపు ఉంటుందని గుండాల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ మనిశ్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి నుంచి బదిలీపై వెళ్తున్న సీహెచ్ఓ శ్రీహరి, హెచ్.వి పద్మ, స్టాఫ్ నర్స్ స్వప్నను సిబ్బంది ఘనంగా సన్మానించారు.

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎంగా సేవలందించి బదిలీ అయిన భాస్కరసూరిని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ ముత్తినేని సుజాత, భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

బీట్ ఆఫీసర్‌కు సన్మానం...

అశ్వాపురం మండల పరిధిలోని చింతిర్యాల ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న వై.అరుణను గ్రామస్తులు, ఫారెస్ట్ రేంజర్, బీట్ ఆఫీసర్లు, వాచర్లు సన్మానించారు.

ములకలపల్లి: స్థానిక తహసీల్‌లో బదిలీపై వెళ్తున్న ములకలపల్లి, జగన్నాథపురం రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్లు తారాచంద్, వెంకటేశ్వర్లు, ఎంపీఎస్ఓ రవిలను ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ పుల్లారావు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలి

అశ్వారావుపేటరూరల్: ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో తల్లిపాల వారోత్సవాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ సౌజన్య కోరారు. బుధవారం మండలంలోని బచ్చువారిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ఈ నెల 1 నుంచి 7 వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.